


# కోడి పోయింది

బి. విజయ లక్ష్మీరాజ్

ఎక్కడైనా కోళ్ళు పోవడం సహజమే. దొరికిన వాళ్ళువదలక పోవడమూ సహజమే. రాధమ్మగారి కోడి పోవడం మాత్రం మామూలు విషయంలా తీసి పారేయడానికి వీలులేదు. అందుకే కోడినే కథానాయికగా ఎన్నుకోడం అన్ని లక్షణాలున్నాయి దానికి మరి!


ఆ రోజు డిసెంబరు ముప్పయ్. కను చీకటితోనే నిద్రలేచి, అలవాటుగా గూటి తలుపులు తెరచి పట్టుకుని పట్టుచీర రెప రెపల లాంటి, ఆ మధురమైన శబ్దం కోసం చెవులు రిక్కించిచూచింది రాధ. ఉహూ....కోడి బయటికి రానే లేదు! తన కాళ్ళనిరుద్దుకుని బయటికి పరిగెత్తే

ఆ కోడి రానేలేదు. ఒకక్షణమాగి, వంగి గూడు నాలుగు మూలలా చేయి పోనిచ్చి చూసింది. కోడికాదుకదా దాని తాలూకు తాజారెట్ట కూడా తగల్లేదు. క్షణం సేపు రాధగుండె ఆగిపోయి మళ్ళీ కదిలింది. బిత్తరగా చుట్టూ చూసింది. కోడి జాడే లేదు. ఫ్రీ ప్యాస్ ఉన్నది కదాని నిన్న ఆరు గంటల ఆటకి సినిమాకెళ్ళి, అందులో విషాదం నెత్తి మీదకెత్తుకుని, వాన మూలంగా రిక్షా దొరక్క ఆలస్యంగా పదిన్నరకి ఇల్లు చేరి తిని పడుకున్నారు. అందుకే కోడిని స్వయంగా మూయలేదు తను. అలవాటుగా, బుద్ధిగా ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా చీకటిపడగానే కొంపకు చేరే ఉత్తమ ఇల్లాలు వంటి తన కోడి నిన్న రాకపోవడమేమిటి? అంటూ - ఒక్క దూకున గదిలోకెళ్ళి దుప్పటి ముసుగు లాగి పడేసి, మొగుణ్ణి లేపి - ఒక్క గుక్కలో చెప్పేసింది. మత్తుగా విని అటు తిరిగి పడుకున్న మొగుణ్ణి చూస్తే ఒళ్ళు మండింది. మండదూ మరి - ఇంత ముఖ్య విషయాన్ని ఇంత తేలిగ్గా తీసుకుంటాడా? కొడుకును చురుగ్గా గిల్లింది. వాడు కుయ్యో మనగానే ఇక తప్పని సరిగా లేచి, కూర్చున్నాడు మోహన్. దిగులుతో చిన్నబోయిన పెళ్ళాంని ముద్దెట్టుకోబోతే విదిలించి పారేసింది-రాధ

అప్పటికే ఇరుగూ పొరుగూ లేచి ఇళ్ళల్లోకి వస్తున్నారు. అన్నట్టుఅది నాలుగిళ్ళలోగిలి - అనేకంటే అద్దె కొంపల కూడలి అనడం సబబు. వెన్నపూస వెంకటప్పయ్యగారిళ్ళు ఎరగని వారెవరూ అంటే—ఇరవై కాపరాల్లో ఐకమత్యం సాధించడానికిగాను ఆయన రెండే పంపులూ-నాలుగే లెట్రిన్సూ పెటించారు. ఈ విధంగా అందరూ ఒకేచోట కలుసుకుని, రచ్చబండ కబుర్లు చెప్పుకుంటూ కలిసిమెలిసి ఉంటారని ఆయన ఊహ. ఎవరింట్లో ఏం జరిగినా ఆ పంపుదగ్గర చర్చనీయాంశమై పోతుంది. దీనికి తోడు ఎదురుగా తిరుపతి ధర్మ సత్రంలాంటి మేడ (ఇక్కడ ధన సత్రం) ఆ ఇంటి యజమాని చాలా సార్లు తిరపతి ధర్మ సత్రాల్లో వుండి, సుఖం అనుభవించి అదే నమూనాలో కట్టిన పోర్షన్లు పదివుంటాయి. ఆ ఇంటి అసలు యజమాని మూల విరాట్టు ఎవరికీ కనబడదు. మేనేజరు కంటే టెనెంట్ శ్రీమాన్ హనుమాన్లు గారు తక్కిన అద్దెవాళ్ళమీద సర్వహక్కులూ పొంది పెత్తనం చేస్తూ వుంటాడు. చెప్పొచ్చేదేమిటీ అంటే ఈ మేడమీది పది కాపరాల వాళ్లు వెంకటప్పయ్యగారి పంపు దగ్గర పంచాయితీకి ప్రత్యక్ష సాక్ష్యులు. పిలవని అతిథులూన్ను. చిన్న కలకలం అక్కడ బయలుదేరగానే వీళ్ళంతా బిలబిలలాడుతూ ఏక వరండాలోకి వచ్చేసి నేత్రానందంగా, వీనుల విందుగా ఖర్చు లేని ఆ ప్రదర్శనాన్ని తిలకించి అవసరం కొద్దీ తమ అభిప్రాయాలు సెలవిస్తుంటారు.

ఇక అసలు కథలోకి పద్దాం —

"చీమకుట్టినట్టేనా లేదుటండీ అంత లావు కోడి పోతేనూ? లేచి చొక్కా వేసుకుని నాల్గుమూలలా వెదికిరండి"అని




గుండీల్లేని చొక్కా అందించింది. వాళ్ళిద్దరి మధ్యా శాంతిఒప్పందం ఏమిటంటే పగలల్లా ఆయన ఆవిడ మాట వినడం రాత్రల్లా ఆవిడ ఆయన మాట వినడమూను. దాదాపు పగలంతా ఆయన ఆఫీసులో వుంటాడు. రాత్రిపదిగంటలకే ఆమె నిద్రపోతుంది కనుక ఇక ఒకరి మాట ఒకరు పాటించేది కొన్ని గంటలే కనుక అట్టే చిక్కులేదు. ఒక్క ఆదివారాలు తప్ప!

ఆ ఒప్పందం తప్పనివాడై చొక్కా ధరించి, పంపుదగ్గరనిలబడి సవ్యసాచిలా నాల్గుదిక్కులా పారజూశాడు. కోడి మాయమవడానికి ఎవరు కారకులో, ఎవరికి అవసరమో భట్టోలా అంచనా వేశాడు. వైశ్యులూ, బ్రాహ్మలతో సైతం అన్ని కులాల వాళ్ళని అనుమానించాడు. సూర్యోదయంతో పాటు కోడి వార్త కూడా నలుగురికి తెలిసిపోయింది. ఎవరికి వారే ఇతరులని అనుమానంగా చూస్తున్నారు. చివరికి ఒక్కొక్కరే తమ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోడానికే, రాధని ఓదార్చి రేపు అప్పు తప్పకుండా పొందడానికి ఆమె దగ్గర చేరారు చేరి—"ఏమ్మా రాధమ్మ తల్లీ – పెట్ట కనబడలేదుటగా! హయ్యో! ఎంతో చక్కగా గున గున లాడుతూ దొడ్డిలో తిరుగుతోంటే ఎంత కళగా వుండేది" అని ఒకరూ—

"అది లేకపోవటం పేటకే అమంగళం" అని ఒకరుగా అంటోంటే రాధ కళ్ళు నీళ్ళతో నిండాయి.

"ఆ కోడిపెట్ట అది ఎంత కలుపుగోలుది అంటే అందరిళ్ళు తన సొంతం లాగ లోపలికొచ్చి. చాటలో బియ్యం, కుండలో అన్నం – చట్టిలో కూరా కడుపునిండా తినేదమ్మా" అన్నది కావమ్మత్త పైకి (లోపల

మాత్రం పీడవిరగడైందిలేఅనుకుంది.) దాంతోముక్కుచీదేసింది రాధ. వేళ్ళకొంగుకు తుడుచుకుంటూనే– "కావమ్మగారూ మీరూ చూశారుగా దాని గుడ్డు పెద్ద దోసిలి నిండా వుండేది. నాబిడ్డ ఒక్కడు పూర్తిగా తినలేక పోయేవాడు. పొదగేస్తే దాని అందం పోతుందని ఊరుకున్నాను గాని ఇదిపోతే దాని పిల్లలన్నాగుర్తుగావుంటాయని తోచలేదండీ" అన్నది సీతమ్మ. "మీకోడిగుడ్డుని ఓసారి ఎగ్జిబిషన్‌లో పెట్టారుగా" అని గుర్తుచేసింది "ఈ మాట నిజమే సుమండీ– రెండు చందమామ లున్న ఆ గుడ్డు అందర్నీ ఆకర్షించింది. ఎవరిదిష్టో ఇలా దెబ్బతీసి వుంటుంది. ఆర్నెల్ల తరువాతైనా నరుకి దృష్టి నల్లరాతికే దెబ్బంటారు. ఇక కోడికి దెబ్బ కాదా?" అంది రాధ.

ఇంతలో సూరేకాంతం డూప్లికేట్ అక్కడ చేరింది– "రాధ వదినా– దాని రంగూ గట్రా చెప్పు, అలా వెళ్ళివెదికేనా వస్తాను" అన్నది. వెంటనే రాధ దిగ్గున లేచి ఇంట్లోకెళ్ళి ఓ కొత్త చీరతెచ్చింది. బూడిద రంగు, దాని మీదతెల్లచుక్కలున్న ప్రింట్ చీర, "అచ్చం కోడి యిలాగే వుండేది– కోడితో కలరు ఫొటో తీయించుకుందామని మ్యాచింగు చీర కూడా కొన్నాను. ఏరికోరి ఇంతలో ఆపద ముంచుకువచ్చింది" అన్నది దిగులుగా. ఇంతలో అమ్మలక్కలు యిలా ఓదారుస్తుంటే, పంపు దగ్గర మొగాళ్ళు మోహన్‌ని ఆరాలడుగుతునారు. సలహాలిస్తునారు. ఎలాగైనాకోడి దొంగని పట్టి తీర్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. పోలీసు రిపోర్టు ఇద్దామన్నారు. పేపరులో వేద్దామన్నారు. సాయంకాలం ఆరు గంటలకు రేడియో స్థానిక వార్తల్లో 'కోడి పోయింది అందజేసినవారికి వంద (పైసలు) బహుమతి' అని ప్రకటిద్దామన్నారు. కార్య సాధన కోసం పాతిక రూపాయలు పోతే పోనిమ్మన్నారు. దాంతో పట్టుదల హెచ్చి పక్కింటి కుర్రాడి వీపుమీద గుద్ది ప్రతిజ్ఞ చేశాడు మోహన్. చోరుని వధించితీరతానని! నిజానికి మోహన్‌కి కోడిమీద అంత ప్రేమలేదు. కాని కోడిని ప్రేమించే పెళ్ళాంమీద తగని ప్రేమ. కోడి ఈ మధ్య తెగబలిసి అడ్డంగా నడుస్తోంది. ఎగిరి గోడమీద కెక్కలేని సుకుమారి అయింది. అప్పచేసైనా చంద్రహారం చేయించి, పెళ్ళాన్ని మురిపించి సంక్రాంతి తర్వాత కనుమునాడు నేతి గారెలు వండించి, ఈ కోడినే కోయించి కుర్మా చేయించి. నంచుకు తినాలని మోహన్‌కి మహా కోరిక. ఈ గుప్త వాంఛ ఈ విధంగా నీరు కారి పోవడం అతను సహించలేకుండా వున్నాడు: కోసిన రోజున ఇంత రుచి చూపించక పోతాడా అని ఆశ పడుతున్న పక్కింటి పుల్లారావుకీ బాధగానే వుంది. ఒక్కొక్కరే ఇళ్ళల్లోకి జారుకున్నారు. పోగొట్టుకున్న రాధకి, మోహన్‌కీ ఎంతబాధగా వుందో – ఎలా పోయిందో తెలిసిన జోగారావుకీ అంత బాధగానే వుంది!

ఆఫీసుకి సెలవు పెటిన మోహనూ' వంటకీ ఇంటి పనులకి సెలవుపెట్టి రాధ పడగ్గదిలో పడివున్నా ఆకలేసిన బాబు

గాడు మాత్రం లావుపాటి పిన్నిగారింట్లో కడుపునిండా తిని పడుకున్నాడు. మధ్య మధ్య కోడి అందాన్ని, సుగుణాల్ని ముఖ్యంగా పరపురుషుల్ని చూచి బెదరిపోయే కన్నెపిల్లలా — అవతల వీధి నుండి వచ్చే ఆ పెద్ద నల్లపుంజుని చూచి బెదరి పారిపోయి, తప్పించుకోలేక ఓడో లొంగిపోయో సాగిపోయే తన అయాయికమైన కోడి అంటే ఎంత ప్రేమ తనకి? అంతేగాదు ఆ కోడి పతివ్రత కూడాను. ఎదురింటి డేగలాంటి ఎర్రపుంజుతో తప్ప ఏ పుంజుతోను తిరగదు. ఐనా తక్కిన విలన్ పుంజులు దాని నిజాయితీని నిలబెట్టుకో నీవాయె।

ఎలా తెలిసిందో సోది చెప్పే సోమక్క రానే వచ్చింది. రాధ చాటడు బియ్యం తెచ్చి, చెయ్యి దాని చేతిలో పెట్టి కూర్చుంది. సర్వక్షుద్ర దేవతలు సోమక్క పిలవగానే పలుకుతారట. కాసేపు అడ్డమైన మంత్రాలు చదివి — కోడి బ్రతికే వుందని, తప్పక దొరుకుతుందని, దొరికాక ఎప్పుడైనా కోసి కూర వండితే తనకికూడా కాస్తపెట్టమని చెప్పి, ఒకపాత చీరా, చాటెడు బియ్యం, పావలా దక్షిణా తీసుకుని దాని దారిన అది పోయింది. మోహన్ సైకిలేసుకుని ఆ చుట్టుప్రక్కలున్న పెంట పోగులన్నీ వెదికాడు. కోడి జుట్టు ఎక్కడా లేదు. ఎవరింట్లోనన్నా దాచేసినా తెలుసుకుందామని పిలిస్తే పలికే కోడి గనుక — చో—చ్చోచ్చో అంటూ కూతలు పెడుతూ తిరిగాడు. అచ్చే జవాబు లేదు. చచ్చిపోతే జుట్టు కనిపించేది. బ్రతికివుంటే జవాబుగా కూసేది. అంటే చావనూ లేదు, బ్రతికీలేదు. మరేమైందబ్బా ?

రాధకి దాదాపు పిచ్చెక్కింది. దిగులుగా కూర్చోడం మాని బహిరంగంగా తిట్లకి లంకించుకుంది. కోడి తిన్నవారిల్లు కూలిపోతుందనీ, వారి వంశం నాశనమౌతుందని శపించింది. కావడానికది పెట్ట ఐనా—ఇల్లెక్కి పుంజులా కూసేదని వాపోయింది. అది కూయకపోయినా తెల్లారి సూర్యోదయమెలా అయిందని విస్తుపోయింది. చుట్టుపక్కల వున్న కోడి స్నేహితులు తిరుగుతుంటే వాటి కఠినత్వానికి, నిర్వికారానికి కోపం వచ్చింది.

అసలు జరిగిందేమిటంటే, దాని హొయలు, లేతవయసు, కొవ్విన వొళ్లూ చూస్తే ఎవరికైనా నోరూరేలావుంటుంది కదా! ఇక జోగారావు బృందానికి ఉమ్మడిగా నోరూరడంలో వింతేమిటి ? అతను పెళ్ళయిన బ్రహ్మచారి. పెళ్ళాం ఇంకా కాపరానికి రాలేదు. కనుక ఇంట్లో కోడికూర వండించుకు తినలేదు. దుర్గావిలాస్‌లో ఐదు రూపాయల కోడికూర తిన్నా చాలదు. అతని జతగాళ్ళలో ఒకరిద్దరికి వంట చేతనౌను. అందరూ కలసి వాటమైన కోడిని వండుకుని చెండుకుని తినాలనుకున్నారు. కొవ్వినకోడి దొరకలేదు. అలాంటప్పుడే రాధగారి చుక్కలకోడి వయ్యారంగా అటే రావడంతో, అందరి కళ్లు జిగేల్‌మన్నాయి. జోగారావ్ చెవిలో వాళ్ళంతా జోరీగల్లాగ కూసి మెప్పించి ఒప్పించారు. ఆ రాత్రి రెండో ఆట సినిమాకి వెళ్ళివచ్చి ఇద్దరు కాపలా వుండగా, ఇద్దరు గూడుతెరచి, చటుక్కున కోడిగొంతు — అరవకుండానే

నొక్కేసి ముత్తానికి గూడు దాటించేశారు, అప్పటిగ్గాని. జోగారావు మత్తు వదల్లేదు. తెల్లబోయి తేరుకునేసరికి కోడి చేతులు మారింది. ఎలాగో మనసు సరిపెట్టుకుందామన్నా — రాధగారి "కోడి గోడు" వినలేకుండా వున్నాడు. పైగా ఆమె శాపనార్థాలు మొదలుపెట్టింది. అవి భరించలేనంత భయంకరంగా వున్నాయి. తాను కొత్తగా పెళ్ళయినవాడు. ఈ పాపం మూలంగా భార్య కాపరానికి రాదేమో! వచ్చినా సంతానం కలగదేమో! కలిగినా పెరగదేమో! ఇలా ఆలోచించేకొలది అతని మతిపోయింది. పాప పరిహారార్థం కోడికంటే విలువైన బిస్కట్ల టిన్ను పది రూపాయలు అప్పుచేసి కొని రాధ కొడుక్కి సమర్పించుకున్నాడు. ఐనా మనశ్శాంతి కలగలేదు. అతడికి ఆ భయంతో జ్వరం వచ్చేసింది. అతడికి పెట్టకుండా కోడిని వండితినడం మిత్రద్రోహం కనుక వాళ్ళు వండలేదు. కాగా దాన్ని దాచడం పెద్ద బెడదైపోయింది. ఏ వేళకి ఏ మేత వేయాలో తెలియదు. ఎప్పుడు ఎంత వేసినా అది తింటూనే వున్నది. ఏరుకుతినే కోడి ఎంత తింటుందో మనకు తెలియదుగాని కట్టి పెంచితే మనిషి తిన్నంత తింటుంది. తల్లి పాలుంటె బిడ్డఖర్చు తెలియదుగాని డబ్బాలు కొంటే తెలిసొచ్చినట్లు తెగతిని ఎటూ తిరక్కుండా పెట్టుంటే కోడికి జీర్ణంకాకపోవచ్చును, కోళ్ళ డాక్టర్ల ఫీజు ఎంతో అందరికి తెలియదు. దాన్ని వేయి కళ్ళతో కాపాడడంకోసం రోజుకి ఒకరుగా మూడు రోజులు శలవు పెట్టేశారు. అటు కోడి కాపలా, ఇటు జోగారావుకి సేవతో సరిపోయింది — ఈలోగా కోడి తినాలనే కోరిక నీరుగారిపోయింది. వాళ్ళకి దిగులుతో మంచమెక్కిన రాధ మీద సానుభూతి కలిగింది. బాగా ఆలోచించి కోడి యథాస్థానంలోకి చేర్చాలని నిశ్చయించుకుని, ఈ లోగా రాధకి పిచ్చెక్కకుండా, ఆత్మహత్య చేసుకోకుండా — ఆపడానికే సోచి సోమక్కకి లంచమిచ్చి పంపారు. జ్వర తీవ్రతలో జోగారావు కోడి-కోడి అని కలవరించుతుంటే ఇరుగు పొరుగు అనుమానంగా ముక్కుమీద వేలేసుకున్నారు. సమయస్ఫూర్తిని గురించి పంచతంత్రం కథల్లో చదివిన సుబ్బారావ్ మాత్రం-జోగారావు పెద్ద తేలుని చూసి జడుసుకున్నాడని మన సంప్రదాయం ప్రకారం తేలుని చూడగానే కోడి-కోడి అని అరవడం ఆచారం గనక జోగారావు కలవరిస్తున్నాడని సర్ది చెప్పాడు. అది నిజమే కద. జ్వర తీవ్రతలో కోడి-కోడి అని కలవరించినట్లే ఎత్తుకెళ్ళిన సంగతి కూస్తాడేమోనని భయపడి కాస్త నల్లమందు అతనిచేత మింగించి, మిగిలినదాన్ని మేతలో కలిపి కోడిచేత మింగించారు. ఇటు జోగారావు అటు చుక్కలకోడి మత్తులో పడటంతో మిత్రుల పని తేలికైంది. మళ్ళీ అప్పుచేసి రెండో ఆట సినిమాకి వెళ్ళి, సాయంకాలమే కొన్న చక్కని ప్లాస్టిక్ బుట్టలో కోడిని పాపాయిలాగ పడుకోబెట్టి, తమ తలలకి తలపాగాలు చుట్టుకొని అరవకుండా వుండడానికి వూర




కుక్కలకి వుప్పుచాప ముక్కలు నోటికందించి, ముక్కోటి దేవతలకి దండం పెట్టుకుని చిన్నగా గూటి దగ్గరికి మోకాళ్ళ మీద పాక్కుంటూ వెళ్ళి కోడిని గృహ ప్రవేశం చేయించి కాలికొద్దీ పరిగెత్తేరు ప్లాస్టిక్ బుట్ట గూటి ముందే వదిలేసి.

తెల తెలవారే ముందు కోడికి తెలివి వచ్చి, ఒళ్ళు విరుచుకుని, ఆవలించి, 'కొక్కొక్కొరోకో' అని కూత వేసింది. మూడు రోజుల తర్వాత ఆ కూత మధురాతి మధురంగా వీనుల విందుగా–ఇరుగు పొరుగు వాళ్ళకి ఒళ్ళు మండేలాగా–ప్రాతః సమయంలో నిశ్శబ్దాన్ని చీల్చుకుని – అన్ని అడ్డాలు దాటి కోడి కలకంటున్న రాధ చెవిలో మోగింది. ఇంకేం మొగుణ్ణి కొడుకుని ఒక్క దూకులో దాటేసి – ఎగురుకుంటూ వచ్చి గూటిలో దూరి కోడిని లాక్కుని కౌగలించుకుని–ముద్దులు పెట్టేసుకుంది రాధ.

తెల్లారేసరికి సూర్యరశ్మిలా ఈ వార్త వాడకట్టు అంతా తెలిసిపోయింది. పోయి మూడురోజులే అయినా 73 డిశంబరులో పోయి, 74 జనవరిలో ఏడాది దాటాక దొరికిన ఆ మాయ కోడిని ఒక్కొక్కరే చూడటానికి వచ్చారు. వస్తూ తలో గుప్పెడు ఏదో ఒకటి తెచ్చివేశారు. పరాయి కూడు తేరగా తిని మూడు రోజుల్లో రెట్టింపు బరువెక్కి, గున్నలా వున్న కోడిని చూస్తే అందరికి కన్ను కుట్టింది. జ్వరం తగ్గగానే జోగారావ్ ముఖం చెల్లక ఇల్లు మార్చేశాడు. మొత్తానికి పదిరూపాయల కోడి అందరిచేత కలిపి ఒక వందరూపాయలు ఖర్చు చేయించింది.

★